క్లుప్తంగా

చినకంచిలో వసంత నవరాత్రి ఉత్సవాలు



నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని చంద్రశేఖరేంద్ర సరస్వతీస్వామి దేవస్థానం చినకంచిలో ఆదివారం నుంచి కామాక్షి అమ్మవారి వసంత నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ప్రతి రోజూ 12వేల మల్లె పూలతో అర్చనలు, సౌందర్యలహరి సంపుటి కరణ, 11 ఆవృత్తులతో, చోడష, ఉపచార పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం వేపు పువ్వు, మామిడికాయ, చింతపండు, బెల్లం, ఉప్పు, కారం, అరటిపండు, జీడిపప్పు , కిసిమిస్, ద్రాక్షపండ్లు, కలిపి తయారు చేసిన ఉగాది పచ్చడిని భక్తులకు ప్రసాదంగా అందచేశారు. కార్యక్రమంలో మొక్కపాటి శర్మ, అర్చకులు, పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ దాతృత్వాన్ని అలవర్చుకోవాలి



కంకిపాడు: ప్రతి ఒక్కరూ దాతృత్వాన్ని అలవర్చుకోవాలని మాజీ ఎంపీపీ దేవినేని రాజా కోరారు. ఈడుపుగల్లు శ్రీనివాసపురానికి చెందిన శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ సభ్యుడు వల్లభనేని రాంబాబు పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బందికి నిత్యావసర సరుకులు వితరణగా అందించారు. ఈ సరుకులు మాజీ ఎంపీపీ దేవినేని రాజా అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పి.ఇందిర, పి. సుధాకర్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్‌కు నివాళి



హనుమాన్‌జంక్షన్ రూరల్: ఇటీవల అనుమానాస్పదంగా మృతి చెందిన పాస్టర్ ప్రవీణ్ పగడాలకు పలువురు క్రైస్తవులు, పాస్టర్లు ఆదివారం ఘన నివాళి అర్పించారు. బాపులపాడు మండలం మల్లవల్లిలో యేసుకృప సహవాసం ఆధ్వర్యంలో పాస్టర్ చౌటపల్లి యేసురత్నం నేతృత్వంలో పాస్టర్ ప్రవీణ్ పగడాల సంతాపం సభ నిర్వహించారు. ఆయన అకాల మరణానికి చింతిస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. జంక్షన్ క్రిస్టియన్ ఫెలోషిప్ పాస్టర్లు, పలువురు క్రైస్తవ విశ్వాసులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రారంభమైన వసంత నవరాత్రులు



గన్నవరం: స్థానిక పాతగన్నవరంలోని శ్రీలక్ష్మీ తిరుపతమ్మ దేవస్థానంలో వసంత నవరాత్రులు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమ్మవారికి వివిధ రకాల పుష్పాలతో అర్చనలు నిర్వహించారు. సాయంత్రం భక్తులచే శ్రీలలితా సహస్ర నామ పారాయణం, హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. తొలిరోజు వీరమాచినేని జానకిబాయి సౌజన్యంతో శ్రీలక్ష్మీతిరుపతమ్మ సమేత గోపయ్యస్వామివార్లకు వస్త్రాలంకరణ చేశారు. అనంతరం జాస్తి విజయభాస్కర్, శివ నాగేంద్రం దంపతులచే భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఏప్రిల్ 6వ తేదీ వరకు వసంత నవరాత్రులు కొనసాగుతాయని ఆలయ కమిటీ అధ్యక్షులు జాస్తి శ్రీధర్ తెలిపారు.

బహుముఖ ప్రతిభాశాలి భాగవతుల



విజయవాడ కల్చరల్: బహుముఖ ప్రతిభాశాలి భాగవతుల వెంకట్రామ శర్మ అని కౌతా పూర్ణానందం విలాస్ ధర్మసత్రం నిర్వాహకుడు కౌతా వెంకటసుబ్బారావు అన్నారు. నూతన సంవత్సం ఉగాది వేడుకల సందర్భంగా 2025 సంవత్సరానికిగానూ కౌతా పూర్ణానందం వేదికపై 'కౌతా పూర్ణానందం స్మారక పురస్కారాల' కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. సుబ్బారావు మాట్లాడుతూ సంప్రదాయ నృత్య కుటుంబానికి చెందిన వెంకట్రామ శర్మ తన జీవితాన్ని నాట్యానికి అంకితం చేసినట్లు తెలిపారు. పురస్కార గ్రహీత వెంకట్రామ శర్మ మాట్లాడుతూ కౌతా పూర్ణానందం ధార్మిక సేవలను వివరించారు. గాయనీ గాయకులు పలు చిత్ర గీతాలను ఆలపించారు. నిర్వాహకులు వెంకట్రామ శర్మను కౌతా పూర్ణానందం పురస్కారంతో సత్కరించారు.

సర్వీసు రోడ్డు మార్గం దుర్గంధం..

- జంతు కళేబరాలు, మాంసం వ్యర్థాలతో నిండిపోతున్న రహదారులు
- మరుగుదొడ్ల వ్యర్థాలూ సర్వీసు రోడ్లలోనే
- జాతీయ రహదారినీ వదలని వ్యాపారులు
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



కంకిపాడు సర్వీసు రోడ్డు మార్గంలోని బైపాస్ వెంబడి పలు చోట్ల ఉన్న జంతు కళేబరాలు, మాంసం వ్యర్థాల గుట్టలు

కంకిపాడు: సర్వీసు రోడ్లలో ప్రయాణం దుర్గంధభరితంగా మారింది. ముక్కు మూసుకుని వాహనదారులు ప్రయాణం సాగిస్తూ అవస్థలు పడుతున్నారు. జంతు కళేబరాలు, మాంసం దుకాణాల వ్యర్థాలతో సర్వీసు రోడ్లు నిండిపోతున్నాయి. రహదారుల నిర్వహణపై అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో అనారోగ్య వాతావరణం నెలకొంటోంది. విజయవాడ–మచిలీపట్నం జాతీయ రహదారి విస్తరణ, అభివృద్ధి క్రమంలో నియోజకవర్గంలోని పెనమలూరు, కంకిపాడు, ఉయ్యూరు మండలాల్లో చాలా ప్రాంతాల్లో సర్వీసు రోడ్లను నిర్మించారు. ఆయా గ్రామాలకు వెళ్లే ప్రజల రాకపోకల సౌకర్యార్థం వీటిని ఏర్పాటుచేశారు.

సురక్షితంగా రాకపోకలు సాగించేందుకు అనువుగా ఏర్పాటుచేసిన సర్వీసు రోడ్లు అస్తవ్యస్తంగా మారాయి. అపరిశుభ్రతకు వేదికగా తయారయ్యాయి.

రహదారులపైనే జంతు కళేబరాలు...

మృతి చెందిన జంతువుల కళేబరాలను సర్వీసు రోడ్డు మార్గంలోనే పడేస్తున్నారు. అంతేకాకుండా మాంసం విక్రయ దుకాణదారులు విక్రయాల ద్వారా వచ్చిన మాంసం వ్యర్థాలను చెత్త డంపింగ్ కేంద్రాలకు తరలించకుండా విచక్షణారహితంగా రోడ్లపై పారబోస్తున్నారు. ముఖ్యంగా సర్వీసురోడ్డు మార్గాల్లో గుట్టలుగా పోస్తున్నారు. అక్కడితో ఆగకుండా మాంసం వ్యర్థాలు, జంతు కళేబరాలకు సైతం నిప్పుపెడుతున్నారు. మాంసం, వ్యర్థాలు కుళ్లిపోయి తీవ్ర దుర్గంధం వెలువడుతోంది. కళేబరాలు, వ్యర్థాలు కాల్చటంతో పొగ కమ్మేసి వాహనదారులకు ఊపిరిసైతం ఆడని పరిస్థితి. పొగ పట్టణం, గ్రామాలపై కమ్మి ప్రజలు అనారోగ్యాల బారిన పడే ప్రమాదం లేకపోలేదు. సర్వీసురోడ్డు మార్గాలు అధ్వానంగా మారటంతో వీటి గుండా ప్రయాణం అంటేనే వాహనదారులు 'వామ్మో కంపు' అంటున్నారంటే సమస్య తీవ్రత ఎంతో అర్థం చేసుకోవచ్చు. ఆఖరికి పలువురు సెప్టిక్ ట్యాంకు వాహన నిర్వాహకులు సెప్టిక్ ట్యాంకు వ్యర్థాలను తీసుకొచ్చి జాతీయ రహదారి, సర్వీసు రోడ్డు మార్గాల్లో యథేచ్ఛగా కుమ్మరించి పోతున్నారు.

అధికారుల పర్యవేక్షణ ఏదీ?

ప్రభుత్వ పెద్దల పర్యటనలు ఉంటేనే సర్వీసు రోడ్డు మార్గాలు, జాతీయ రహదారి మార్జిన్‌లలో పరిశుభ్రత పనులు చేపట్టాలనే ఆలోచన తడుతుంది. అప్పటి వరకూ కనీసం ఆ వైపు కూడా కన్నెత్తి చూడరు. జాతీయ రహదారుల శాఖ నుంచి స్థానిక సంస్థల ప్రతినిధులు వరకూ ఏ ఒక్కరూ తమ పరిధిలో రహదారుల నిర్వహణ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించటం లేదు. ఫలితంగా మాంసం దుకాణదారులు, పండ్ల దుకాణదారుల వ్యర్థాలతో రహదారులు అస్తవ్యస్తంగా తయారై, ప్రజల ఆరోగ్యాలకు ప్రమాదం పొంచి ఉంది. ప్రజారోగ్యం ప్రమాదంలో పడితే తప్ప అధికారుల్లో చలనం వచ్చేలా కనిపించటం లేదని పలువురు వాహనదారులు పెదవి విరుస్తున్నారు.

స్థానిక సంస్థల ఫలితాలు కూటమికి గుణపాఠం

వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జి.ప్రణీత్‌కుమార్



జి.ప్రణీత్‌కుమార్

కంకిపాడు: ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఫలితాలు కూటమికి గుణపాఠం అని వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జి.ప్రణీత్‌కుమార్ అన్నారు. ఆదివారం కంకిపాడు వచ్చిన ప్రణీత్‌కుమార్ విలేకరులతో మాట్లాడారు. ఇటీవల జరిగిన ఉపసర్పంచ్, ఎంపీపీ స్థానాల ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు మూకుమ్మడిగా వైఎస్సార్ సీపీ బలాన్ని నిరూపించారన్నారు. కూటమి ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా తలొగ్గకుండా వైఎస్సార్ సీపీ మద్దతుదారులకే మద్దతుగా నిలిచారన్నారు. మెజారిటీ స్థానాలను వైఎస్సార్ సీపీ దక్కించుకుందన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలే టార్గెట్‌గా కూటమి ప్రభుత్వం నీచ రాజకీయాలు సాగిస్తోందన్నారు. కుట్రలను భరిస్తూ వైఎస్సార్ సీపీ పక్షానే నేతలు, ప్రజాప్రతినిధులు నిలిచారన్నారు. కూటమి అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి విస్తృతంగా ప్రచారం చేసి ప్రభుత్వ వైఫల్యాలపై చైతన్యపరచాలని శ్రేణులకు పిలుపునిచ్చారు.

గ్రామగ్రామాన ఘనంగా ఉగాది వేడుకలు

గన్నవరం: స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో ఆదివారం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విశ్వావసు నామ తెలుగు సంవత్సర ఉగాది పర్వదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత నడక, బ్యాడ్మింటన్ పోటీల్లో తొలి మూడు స్థానాల్లో నిలిచిన వాకర్స్‌కు సీఐ బీవీ. శివ ప్రసాద్ చేతుల మీదుగా బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం పండితులచే పంచాంగ శ్రవణం జరిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నడక వల్ల ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. వాకర్స్ సభ్యులందరూ కుటుంబంగా ఏర్పడి ఉగాది సంబరాలు జరుపుకోవడం సంతోషకరమన్నారు. క్రీడా ప్రాంగణం అభివృద్ధితో పాటు క్రీడాకారులను ప్రోత్సాహిస్తున్న కేవీఆర్ కిషోర్‌ను ఆయన అభినందించారు. వాకర్స్ అసోసియేషన్ డిస్ట్రిక్ట్ గవర్నర్ శనక సుబ్బారావు మాట్లాడుతూ గన్నవరం వాకర్స్ అసోసియేషన్ అభివృద్ధి, సేవా కార్యక్రమాల్లో జిల్లాకే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. తొలుత క్రీడా ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన బోర్‌వెల్ పనులకు భూమిపూజ చేశారు. వాకర్స్ అధ్యక్ష, కార్యదర్శులు కేవీఆర్ కిషోర్, ఎస్. శ్రీనివాసరావు నేతృత్వంలో డీపీఆర్‌టీ రాష్ట్ర అధ్యక్షుడు డి. శ్రీను, జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి, సర్పంచ్ నిడమర్తి సౌజన్య, అసోసియేషన్ గౌరవాధ్యక్షులు తిరివీధి వెంకయ్య, కోశాధికారి బి.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



అభయాంజనేయ స్వామి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు



శ్రీ సూర్యనారాయణ స్వామి అలంకార రూపంలో దర్శనం

పలు గ్రామాల్లో ఉగాది వేడుకలు

రామవరప్పాడు: విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలను రూరల్ మండలం పలు గ్రామాల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు, గూడవల్లి గ్రామాల్లోని పలు ఆలయాలు భక్తులతో కిక్కిరిసాయి. ఉదయం నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు ఇనుగంటి లక్ష్మి నరసింహ శర్మ ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం జరిగింది. ఈ పూజా కార్యక్రమాలల్లో ఆలయ కార్యనిర్వహణాధికారి పి. ప్రియాంక, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పోరంకిలో ఘనంగా ఉగాది పండుగ

పెనమలూరు: పోరంకి శ్రీనగర్‌కాలనీలోరి శ్రీకోదండరామయాలయంలో ఆదివారం శ్రీ విశ్వవసు నామ సంవత్సరం ఉగాది పండుగ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. అనంతరం బ్రహ్మశ్రీ సత్యసాయిబాబాప్రసాద్ పంచాగశ్రవణం చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ఉగాది పచ్చడితో పాటు స్వామివారి ప్రసాదం పంపిణీ చేశారు. కాగా ఏప్రిల్ 6వ తేదీ శ్రీనామనవమి పండుగ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆలయకమిటీ అధ్యక్షుడు వై.రాధాకృష్ణ మూర్తి తెలిపారు.

కంకిపాడు: ఉగాది పర్వదినాన్ని ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆదివారం ఉదయాన్నే తలస్నానాలు ఆచరించి, నూతన దుస్తులు ధరించి షడ్రుచులతో కూడిన ఉగాది పచ్చడి భుజించారు. తొలుత ఆయా గ్రామాల్లోని ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు జరిపించారు. కంకిపాడు పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వి.భావనారాయణ, సిబ్బంది పాల్గొని ప్రత్యేక పూజలు చేయించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా ఉగాది సంబరాలు

గన్నవరం రూరల్: మండలంలో శ్రీ విశ్వవసు నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. భక్తులు ఆయా గ్రామాల్లో ఇష్ట దైవాలను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. చిక్కవరం శ్రీక్షేత్ర హనుమత్‌పురంలో శ్రీ సూర్యాంజనేయ స్వామిని భక్తులు విశేషంగా దర్శించారు. ఉగాది పర్వదినం ఆదివారం వచ్చిందని ఆది దేవుడైన సూర్యనారాయణ స్వామి ఆశీస్సులు ఈ సంవత్సర కాలం భక్తులపై మెండుగా ఉంటాయని అర్చకులు భక్తులకు అభిభాషణం చేశారు. ఆలయ నిర్వాహకులు చిట్టినేని వంశీ ఏర్పాట్లు పర్యవేక్షించారు. అనంతరం వందలాది మందికి అన్నదానం చేశారు. సూర్యాంజనేయ స్వామి ఆలయం ఆధ్వర్యంలో పలు చోట్ల చలివేంద్రాలను ప్రారంభించారు.

అభయాంజనేయ స్వామి సన్నిధిలో...

హనుమాన్‌జంక్షన్ రూరల్: ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో తెలుగు సంవత్సరాది వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని తెల్లవారు జాము నుంచే ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. మండుటెండను సైతం లెక్కచేయక ఆలయం వద్ద భక్తులు బారులు తీరారు. పూలమాలలతో అంజనీపుత్రుడిని, ఆలయాన్ని విశేషంగా అలంకరించారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని అధ్యాత్మిక వేదికపై అర్చకులు శృంగారం రామానుజాచార్యులు విశ్వావసు నామ సంవత్సర పంచాంగ శ్రవణం చేశారు. నూతన సంవత్సరంలో ప్రజలందరికీ మేలు చేకూరాలని ఆకాంక్షించారు. కార్యనిర్వహణాధికారి తారకేశ్వరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



నడక పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న సీఐ శివప్రసాద్



పేరంటాలమ్మ దర్శనానికి బారులు తీరిన భక్తులు



కంకిపాడు తహసీల్దార్ కార్యాలయంలో పంచాంగ శ్రవణంలో అధికారులు

ముగిసిన ఎంఎస్ మూర్తి శతజయంతి ఉత్సవాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక ముత్యాలంపాడు ఎంఎస్‌మూర్తి ఆర్ట్ గ్యాలరీలో ఆదివారం ఎంఎస్ మూర్తి శతజయంతి ఉత్సవాలు ముగిశాయి. ఈ సందర్భంగా ఆంధ్ర అకాడమీ ఆఫ్ ఆర్ట్స్, ఫోరం ఫర్ ఆర్టిస్ట్, జాషువా సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో చిత్రకళా ప్రదర్శన కళాకారుల సత్కారం కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో సిద్ధార్థ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్, డీమ్డ్ యూనివర్సిటీ ప్రో వైస్‌ఛాన్సలర్, ప్రొఫెసర్ అట్లూరి వెంకట రత్నప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని చిత్రకళా ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళలు సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబిస్తాయని కళలను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. అకాడమీ కార్యదర్శి ఎంవీ సాయిబాబు మాట్లాడుతూ చిత్రకళ అభివృద్ధికి ఎంఎస్ మూర్తి అందించిన సేవలను పురస్కరించుకుని ఆయన శతజయంతి ఉత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం సిద్ధార్థ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఎం రవిచంద్ అకాడమీ కార్యదర్శి ఎంవీ సాయిబాబు చిత్రకారుల చేతులమీదుగా చిత్రకారుడు ఎన్ నాగేశ్వరరావు, కళా సేవకులు అయోధ్య నాగేశ్వరరావు, బీ నగేష్‌కుమార్, ఉగాది సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి కళారత్న పురస్కార గ్రహీత ఏ గిరిధర్‌లను సత్కరించినారు. చిత్రకారులు ఏ సునీల్‌కుమార్, పరుచూరి అజయ్, మల్లిక్, సృజన్ తదితరులున్నారు.



సన్మాన గ్రహీతలతో నిర్వాహకులు

నేడు వడ్డీపై రాయితీకి చివరి అవకాశం

పటమట(విజయవాడ తూర్పు): విజయవాడ నగర పాలక సంస్థకు చెల్లించాల్సిన ఇంటి పన్ను, ఖాళీ స్థలాల పన్ను బకాయిల వడ్డీపై 50 శాతం రాయితీ పొందేందుకు సోమవారమే చివరి అవకాశమని వీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ డీ చంద్రశేఖర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రంజాన్ సెలవు అయినా కూడా వీఎంసీ పరిధిలోని 13 క్యాష్ కౌంటర్లు ఉదయం ఆరు నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు పనిచేస్తాయని తెలిపారు. అన్ని సచివాలయాల్లోనూ పన్నులు చెల్లించవచ్చని అన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పన్ను బకాయలు చెల్లించి వడ్డీపై 50 శాతం రాయితీని పొందాలని ఆయన కోరారు.

మత్తుపదార్థాలకు యువత దూరంగా ఉండాలి

ఎంసీపీఐ రాష్ట్ర కార్యదర్శి వెంకటరెడ్డి

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): మతోన్మాదానికి, మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని ఎంసీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఎం.వెంకటరెడ్డి పేర్కొన్నారు. స్థానిక మాచవరం కళాశాల దగ్గర ఉన్న ఎంసీపీఐ రాష్ట్ర కార్యాలయంలో భారత ఐక్య యువజన సమాఖ్య (యూవైఎఫ్ఐ) నగర కమిటీ ఆధ్వర్యంలో వైజ్ఞానిక తరగతులు ఆదివారం జరిగాయి. ఈ కార్యక్రమానికి వెంకటరెడ్డి హాజరై మతోన్మాదం, మత్తుపదార్థాల వినియోగం–సమాజంపై వాటి దుష్ప్రభావాలు అనే అంశంపై మాట్లాడారు. ప్రస్తుతం దేశంలో ప్రమాదకరస్థాయిలో మతోన్మాదంతో పాటుగా మత్తుపదార్థాల వినియోగం ఉన్నాయని చెప్పారు. యువత వీటికి వ్యతిరేకంగా పోరాడాలన్నారు. యువైఎఫ్ఐ రాష్ట్ర కన్వీనర్ కాసాని గణేష్ బాబు మాట్లాడుతూ ఇటీవల కాలంలో రాష్ట్రంలో మత్తు పదార్థాల వినియోగం ఎక్కువగా ఉందన్నారు. వీటి జోలికి వెళ్లి యువత తమ ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని కోరారు. సమాఖ్య ఉమ్మడి కృష్ణాజిల్లా కార్యదర్శి గొల్లపూడి ప్రసాద్, గుంటూరు జిల్లా కార్యదర్శి బందారు శ్రీనివాసరావు, ఏపీసీటీయూ రాష్ట్ర కన్వీనర్ వల్లెపు లక్ష్మీనారాయణ, యువైఎఫ్ఐ నగర నాయకులు అనకాపల్లి కనకరాజు, హరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా నిరసన

పెనమలూరు: వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా కానూరు సనత్‌నగర్‌లో ఆదివారం ముస్లింలు భారీ ర్యాలీ చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు జమాతే అహ్లే హదీస్ విజయవాడ నగర అధ్యక్షుడు నసీర్ అహ్మద్ ఉమ్రి మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారా ముస్లింలకు కల్పించిన హక్కులను వక్ఫ్ సవరణ బిల్లుతో కాలరాసే కుట్ర జరుగుతుందని ఆరోపించారు. వందల సంవత్సరాల నాటి మసీదులు, మదర్‌సాలు పత్రాలు అందుబాటులో లేకపోతే వాటిని స్వాధీనం చేసుకోవటానికే వక్ఫ్ సవరణ బిల్లు తెరపైకి తెచ్చారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ ఆస్తులు ఆక్రమించుకోవటానికి కుట్ర పన్నుతుందని ఖండించారు. నేడు ప్రజాస్వామ్యానికి పెద్ద ప్రమాదం ఏర్పడిందని తెలిపారు. ముస్లింలు ఐక్య పోరాటం చేసి వక్ఫ్ సవరణ బిల్లుకు అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. విశ్రాంత పోలీస్ అధికారి ఏఎస్.ఖాన్ మాట్లాడుతూ వక్ఫ్ సవరణ బిల్లుతో ముస్లిం సమాజానికి తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. వక్ఫ్ సవరణ బిల్లుతో దేశ లౌకిక, ప్రజాస్వామ్య వ్యవస్థకు పెద్ద ప్రమాదమన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటువంటి చర్యలు మానుకోవాలని తెలిపారు. సనత్‌నగర్‌లో వివిధ మసీదులకు చెందిన ముస్లింలు ర్యాలీలో పాల్గొని తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆసిఫ్‌పాషా, మస్జీద్ ఏ ఆక్సా ఇమామ్ మొహమ్మద్ సులేమాన్ ఖాస్మి, మైనారటీ నేతలు మొహమ్మద్ సిద్ధిక్, మునీర్ ఖాన్, సన్నావులహా పలువురు పాల్గొన్నారు.



వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా సనత్‌నగర్‌లో ర్యాలీ చేస్తున్న ముస్లింలు

దాహార్తి తీర్చేందుకే చలివేంద్రాలు



కానూరులో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీఐ వెంకటరమణ



భక్తులకు మజ్జిగ అందజేస్తున్న నాయకులు



కార్మికులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న దుట్టా శివన్నారాయణ



పోరంకిలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బోడెప్రసాద్

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో ఆదివారం మజ్జిగ చలివేంద్రాన్ని గ్రామ మాజీ ఉపసర్పంచ్ కొల్లా ఆనంద్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి పి. ప్రియాంక మాట్లాడుతూ దాతల సహకారంతో ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని వేసవి పూరైయ్యే వరకు కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. ప్రయాణికులు, భక్తులు, బాటసారుల దాహార్తిని తీర్చడానికి దాతలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి ఈ ఉచిత మజ్జిగ చలివేంద్రానికి సహకరిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ అద్దేపల్లి సాంబు, కొంగన రవి, కల్లేపల్లి సాయి, మత్తె రాధా, పట్టపు చంటి తదితరులు పాల్గొన్నారు.

వేసవి దప్పిక తీర్చడానికే చలివేంద్రాలు

పెనమలూరు: వేసవి దప్పిక తీర్చడానికి దాతలు ముందుకు వచ్చి చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని పెనమలూరు సీఐ జె. వెంకటరమణ అన్నారు. ఆయన ఆదివారం కానూరు పెట్రోల్‌బంక్ వద్ద శ్రీచైతన్య కాలేజీ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభి ంచారు. ఎండ తీవ్రత కారణంగా ప్రయాణికులు చాల ఇబ్బందులు పడతారని ఇది దృష్టిలో ఉంచుకోని చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. కాలేజీ డీన్ హరిబాబు మాట్లాడుతూ ప్రతి రోజు 100 కేజీల పెరుగుతో మజ్జిగ చేసి ప్రయాణికులకు అందచేస్తామన్నారు. మజ్జిగతో పాటు తాగు నీరు కూడా అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ఏజీఎం కోటేశ్వరరావు, కెఎస్ఆర్, తిరుపతి రావు, శ్రీకాంత్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ పరిధి పోరంకి శివాలయం వద్ద ఆదివారం ఎమ్మెల్యే బోడె ప్రసాద్ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే ప్రసాద్ మాట్లాడుతూ వేసవి దప్పిక తీర్చడానికి దాతలు చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ ఏడాది ఎండ తీవ్రత ఉంటుందని నిపుణులు సూచిస్తున్నందున ప్రజలు తగిన జాగ్రత్తలో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు అనుమోలు ప్రభాకరరావు, కర్లపూడి సుబ్బారావు పలువురు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: వేసవిలో పాదచారులు, ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి చలివేంద్రాలు ఏర్పాటు చేయటం అభినందనీయమని బాపులపాడు ఉపసర్పంచ్ దుట్టా శివన్నారాయణ అన్నారు. స్థానిక విజయవాడరోడ్డులోని సాయి గణేష్ ఎంట్రర్‌ప్రైజర్స్ అధినేత తోట శేష సాయి, హనుమాన్ టెంట్ హౌస్ రౌతు రమణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. తొలిరోజు చలివేంద్రం వద్ద రిక్షా, ముఠా కార్మికులు, పాదచారులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఏటా వేసవిలో చలివేంద్రం నిర్వహిస్తున్న తోట శేషసాయి, రౌతు రమణలను పలువురు అభినందించారు. మారుతీ ఎలక్ట్రానిక్స్ అధినేత మత్తి రాంబాబు, జయతి ఫ్లెవుడ్స్ అధినేత కట్టా నరేంద్ర పాల్గొన్నారు.

2న సంప్రదాయ వస్త్రధారణ పోటీలు

విజయవాడ కల్చరల్: శ్రీదేవీ సాంస్కృతిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వచ్చే నెల 2వ తేదీన సాయంత్రం మూడు గంటలకు బందరురోడ్డులోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో సంప్రదాయ వస్త్రధారణ పోటీలను నిర్వహించనున్నట్లు సంస్థ వ్యవస్థాపకురాలు దూపాటి శ్రీదేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎవరైనా పోటీల్లో పాల్గొనవచ్చునని చెప్పారు.